హామీల అమలుకు ప్రాధాన్యం: మంత్రి పొంగులేటి

కూసుమంచి, నేలకొండపల్లి, న్యూస్‌టుడే: శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, గౌడలకు కాటమయ్య కిట్లను నేలకొండపల్లిలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో సరిగ్గా పది నెలల క్రితం ఏర్పడిన ప్రజా ప్రభుత్వం.. రాష్ట్ర ప్రగతికి, ప్రజా సంక్షేమానికి పాటుపడుతోందని చెప్పారు. గీత కార్మికులు, మత్స్యకారుల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలో 100 మంది గీత కార్మికులకు కాటమయ్య కిట్లు అందజేస్తున్నామన్నారు. ఖమ్మం ఆర్డీఓ గణేష్, అబ్కారీశాఖ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, సహాయ సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డి, డీఈఓ సోమశేఖరశర్మ, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు వెన్నపూసల సీతారాములు, మాజీ ఎంపీపీ వజ్జ రమ్య తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో డీఈఓ సోమశేఖరశర్మ

గడువు పొడిగింపు

ఖమ్మం సంక్షేమవిభాగం, న్యూస్‌టుడే: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించటానికి అర్హులైన ఎస్సీ విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 29 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు కస్తాల సత్యనారాయణ బుధవారం ప్రకటించారు. అర్హులైన విద్యార్థులు వెబ్‌సైట్ https://telanganaepass.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సహాయ కమిషనర్ ఆకస్మిక బదిలీ

ఖమ్మం కార్పొరేషన్, మధిర, న్యూస్‌టుడే: ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సంపత్‌కుమార్ మధిర పుర కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16న సంపత్‌కుమార్ కేఎంసీ సహాయ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. మధిర కమిషనర్‌గా పనిచేస్తున్న అఖ్తర్ షఫీ ఉల్లాను ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఎస్ఓల్లో పనిచేస్తున్న బెల్లం రాధికను ఖమ్మం నగరపాలక సంస్థ ఉద్యానవనాధికారిగా నియమించినట్లు తెలుస్తోంది. దసరా రోజు మధిరలో మున్సిపల్ కౌన్సిలర్లతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సమావేశమయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్‌పై కౌన్సిలర్లు భట్టికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బదిలీలు జరిగినట్లు సమాచారం.

మూడున్నరేళ్లయినా.. ముందడుగేదీ..?

ఈటీవీ, ఖమ్మం, న్యూస్‌టుడే, ఖమ్మం మామిళ్లగూడెం

ఖమ్మం నగరంలో ఐటీ హబ్-1 సత్ఫలితాలివ్వడంతో మరికొంతమందికి ఉపాధి కల్పించాలనే సంకల్పంతో చేపట్టిన ఐటీ హబ్-2 నిర్మాణ పనులు అతీగతీ లేకుండా పోతున్నాయి. రూ.36 కోట్ల అంచనా వ్యయంతో ఐటీ హబ్-2 నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఏడాదిలోనే దీన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యం నిర్దేశించింది. గుత్తేదారు అలసత్వం, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఐటీ హబ్-2 పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారయ్యాయి.

కొరవడిన పర్యవేక్షణ

సాంకేతిక విద్యనభ్యసించిన వారికి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా కేంద్రాల్లో ఐటీ హబ్‌ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఖమ్మం నగరంలో సకల హంగులతో ఐటీ హబ్-1 నిర్మించింది. 14 ఐటీ కంపెనీలు కొలువుదీరటంతో వందలాది మందికి ఉపాధి అవకాశాలు దక్కాయి. మరికొందరికి ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో 2021లో అప్పటి ప్రభుత్వం ఖమ్మం నగరానికి ఐటీ హబ్-2ను మంజూరు చేసింది. 2021 ఏప్రిల్ 2న పనులు ప్రారంభించింది. 2022 ఏప్రిల్ నాటికి ఐటీ హబ్-2ను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యం నిర్దేశించుకుంది. మూడున్నరేళ్లు దాటినా పిల్లర్ల దశలోనే పనులు ఉన్నాయి.


పిల్లర్ల దశలోనే ఐటీ హబ్-2 నిర్మాణ పనులు

★ ఖమ్మం జిల్లా కేంద్రంలో తెలంగాణ పారిశ్రామిక, మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) అధికారులు ఉన్నప్పటికీ.. వరంగల్ నుంచి వచ్చి పర్యవేక్షిస్తున్నారని ఇక్కడివారు చెబుతుండటం గమనార్హం. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారిస్తేనే ఐటీ హబ్-2 నిర్మాణ పనులు ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గుత్తేదారుకు దిశానిర్దేశం చేసేలా టీజీఐఐసీ అధికారులు, కలెక్టర్‌తో మంత్రి సమీక్ష జరపాలని విద్యాధికులు కోరుతున్నారు.

ఐటీ హబ్-2 పనులు చకచకా జరిగేలా చొరవ చూపుతాం. గుత్తేదారు తీరు మారకపోతే నోటీసులు జారీ చేస్తాం. వీలైనంత త్వరగా ఐటీ హబ్-2ను అందుబాటులోకి తీసుకురావటమే మా లక్ష్యం.
- స్వామి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్, వరంగల్

జలజలా.. ఉబికివచ్చెనిలా..!



ఖమ్మం నగరం, న్యూస్‌టుడే

ఖమ్మం వ్యవసాయ ప్రధాన జిల్లా. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్న చందంగా వ్యవసాయ రంగం బాగుండాలంటే సమృద్ధిగా వర్షాలు కురవాలి. ఈ ఏడాది ఖమ్మం జిల్లాను భారీ వరదలు, వానలు ముంచెత్తాయి. దీని ప్రభావంతో భూగర్భ జలం ఉబికి వచ్చింది. సెప్టెంబరు నెలకు సంబంధించిన భూగర్భ జలమట్టం వివరాలను అక్టోబరులో విడుదల చేస్తారు. జిల్లాలోని 66 ఫీజో మీటర్లతో భూగర్భ జలమట్టం వివరాలు ప్రతినెల సేకరిస్తారు. ఈ లెక్కల ప్రకారం ఒక్క ఖమ్మం అర్బన్ మండలం మినహా జిల్లాలోని అన్ని మండలాల్లో జలమట్టం పెరగడం విశేషం. ముదిగొండ, సత్తుపల్లి, మధిర మండలాల్లో భూగర్భ జలాలు అధికంగా పెరిగాయి. జిల్లాలో సరాసరిన 1.03 మీటర్లు పెరిగింది.

◆ 2024 జూన్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు సాధారణ వర్షపాతం 794.70 మి.మీ. కాగా వాస్తవంగా 1191.30 మి.మీ. వర్షం కురిసింది. 49.90 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇప్పటివరకు 63 రోజులు వర్షం కురిసింది.

భూగర్భ జలమట్టం (మీటర్లలో..)

మండలం	సెప్టెంబరు 2023	సెప్టెంబరు 2024	వ్యత్యాసం
ఖమ్మం అర్బన్	0.52	0.63	0.11(-)
ఖమ్మం రూరల్	2.32	1.34	0.98
తిరుమలాయపాలెం	1.81	1.39	0.42
కూసుమంచి	3.19	2.58	0.61
నేలకొండపల్లి	1.64	1.48	0.16
బోనకల్లు	2.05	1.21	0.84
చింతకాని	2.85	2.13	0.72
ముదిగొండ	7.05	0.92	6.13
కొణిజర్ల	1.35	0.90	0.45
సింగరేణి	2.39	1.24	1.15
కామేపల్లి	4.33	2.72	1.61
మధిర	4.40	1.84	2.56
ఎర్రుపాలెం	3.94	2.66	1.28
వైరా	1.41	0.97	0.44
రఘునాథపాలెం	2.60	1.56	1.04
సత్తుపల్లి	13.31	9.74	3.57
వేంసూరు	3.74	2.36	1.38
పెనుబల్లి	4.13	3.27	0.86
కల్లూరు	1.82	1.35	0.47
తల్లాడ	1.77	1.38	0.39
ఏన్కూరు	7.05	5.13	1.92
జిల్లా సరాసరి	3.52	2.49	1.03

ఇక ఎరువు.. బరువు కాదు..!

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

ఎరువుల సరఫరా ప్రక్రియను మరింత సులువు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు మొదలు పెట్టింది. ఎరువుల సరఫరాకు ప్రస్తుతం ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్ మాత్రమే వ్యవహరిస్తోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మారుమూల ప్రాంతాల రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు అందుబాటులో లేకపోవటంతో వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ(ఆగ్రోస్)ను మరో నోడల్ ఏజెన్సీగా సర్కారు ఎంపిక చేసింది. వచ్చే యాసంగి సీజన్ నుంచి ఆగ్రోస్ నేరుగా కంపెనీల నుంచి ఎరువులు తీసుకొచ్చి రైతులకు విక్రయించనుంది.



ఆగ్రోస్ సేవలు..

సుమారు రెండు దశాబ్దాల క్రితం 'ఆగ్రోస్' ద్వారా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన ఆధునిక యంత్రాలు, పరికరాలను రైతులకు రాయితీపై ప్రభుత్వం అందజేసింది. ఇందుకోసం అప్పట్లో జిల్లా స్థాయుల్లో ప్రత్యేకంగా ప్రాంతీయ కార్యాలయాలు ఉండేవి. నిధుల కొరతతో క్రమేణా ఇవి ప్రాభవం కోల్పోయి చివరికి మూతపడ్డాయి. సిబ్బందిని రాష్ట్రస్థాయి కార్యాలయంలో ప్రభుత్వం సర్దుబాటు చేసింది. ప్రస్తుతం అంపశయ్యపై ఉన్న ఈసంస్థ ప్రాణాన్ని నిలబెట్టాలని సర్కారు యోచిస్తోంది. రైతులకు ఎరువులను సరఫరా చేసే బాధ్యతను అప్పగించాలని భావించింది. ఐదేళ్లుగా 'ఆగ్రోస్' రైతు సేవా కేంద్రాల ఏర్పాటుకు పూనుకుంది. నిరుద్యోగ పట్టభద్రులు వీటిని నిర్వహించుకునేందుకు అనుమతించింది. ప్రస్తుతం వీటి ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాలు జరుగుతున్నాయి.

ఆగ్రోస్ ద్వారా ఎరువుల సరఫరా చేపడితే రైతులకు దూరభారం తగ్గుతుంది. దీనివల్ల ఖర్చు సైతం ఆదా అవుతుంది. సరఫరా కేంద్రాల సంఖ్య పెరగటం వల్ల వానాకాలం, యాసంగి సీజన్లలో అన్నదాతలకు సకాలంలో ఎరువులు అందుతాయి.
- దనసరి పుల్లయ్య, డీఏఓ

రైతులకు మేలు..

మార్క్‌ఫెడ్ ద్వారానే కాకుండా 'ఆగ్రోస్'తో ఎరువులను సరఫరా చేయాలని ప్రభుత్వం భావిస్తుండటం వల్ల రైతులకు మేలు జరగనుంది. తద్వారా ప్రతి గ్రామానికి సకాలంలో ఎరువులు అందనున్నాయి. అయితే ఇందుకు తగిన విధంగా 'ఆగ్రోస్' ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరం ఉంది. పెద్దఎత్తున ఎరువుల నిల్వల కోసం గోదాములను సమకూర్చుకోవాలి.

	ఖమ్మం	భద్రాద్రి
ఎరువుల దుకాణాలు	580	350
సహకార సంఘాలు	76	20

కావాల్సిన ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

	ఖమ్మం	భద్రాద్రి
యూరియా	85,693	42,788
ఎంఓపీ	27,672	13,650
డీఏపీ	33,765	14,280
కాంప్లెక్స్	89,928	44,744
ఎస్ఎస్‌పీ	2,750	9,868



నీటి పారుదల శాఖలో ఏఈఈల కేటాయింపు

ఖమ్మం నగరం: రాష్ట్ర ప్రభుత్వం టీజీపీఎస్సీ ద్వారా ఎంపిక చేసిన ఏఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్)లకు జిల్లాల వారీగా నీటిపారుదలశాఖలో పోస్టింగ్‌లిచ్చారు. ఎంపికైన ఏఈఈలకు ఇటీవల హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి నియామకపత్రాలు అందజేశారు. జిల్లాకు 17 మందిని కేటాయించి ఆయా సబ్ డివిజన్ కార్యాలయాల్లో విధుల్లో చేరాలని ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 15మంది కొత్త ఏఈఈలు విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 23సబ్ డివిజన్లుండగా కొత్తగా 17 మంది విధుల్లో చేరినా మరో 17పోస్టులు ఖాళీగా ఉంటాయి. త్వరలో వీటిని భర్తీచేయొచ్చు.

31 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది ముందస్తుగా ఇప్పటి వరకు 31 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. సన్న ధాన్యం (గ్రేడ్-ఏ) కొనుగోలుకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరపై అదనంగా రూ.500 బోనస్ ఇవ్వనున్నారు. ధాన్యం కొనుగోలుపై అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. సన్న ధాన్యం వ్యాపారులు, మిల్లర్లు కొనుగోలు చేయకముందే రైతులు కేంద్రాలకు తీసుకొచ్చే విధంగా గ్రామాల్లో అవగాహన పెంచేందుకు ముందుగానే కేంద్రాలు ప్రారంభిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 322 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కలెక్టర్ నిర్ణయించినట్లు డీఎస్‌వో చందన్‌కుమార్ తెలిపారు. సన్నధాన్యం కొనుగోలుకు ప్రత్యేకంగా 267 కేంద్రాలు, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు 55 కేద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సన్న ధాన్యం కొనుగోలుకు సొసైటీలు (పీఏసీఎస్) 155, డీసీఎంఎస్ 30, డీఆర్డీఏ, ఐకేపీ 82 కేంద్రాలు నిర్వహిస్తాయని, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు డీఆర్డీఏ, ఐకేపీ ద్వారా 55 కేంద్రాలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో 31 కేంద్రాలు ప్రారంభించామని వివరించారు.

చురుగ్గా.. రోడ్ల పునరుద్ధరణ

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: మున్నేరు వరదలు, అధిక వర్షాలకు జిల్లాలో తెగిపోయిన పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని రహదారుల పునరుద్ధరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన 36 పనులకు రూ.1.44 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో తాత్కాలిక మరమ్మతులకు అధికారులు పూనుకున్నారు. పైపు కల్వర్టులు కొట్టుకుపోగా, తారు రోడ్లు తెగిపోయి భారీ నష్టం జరిగింది. రహదారులు దెబ్బతినటంతో గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దెబ్బతిన్న రోడ్ల శాశ్వత మరమ్మతులకు సుమారు రూ.300 కోట్లు కావాల్సి ఉంటుంది. అయితే అధికారులు అత్యవసర పనులు గుర్తించి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. 36 పనుల్లో ఇప్పటికే 11 పనులను పూర్తిచేశారు. మరో నాలుగు పనులు పురోగతిలో ఉన్నాయి. రఘునాథపాలెం మండలంలో ఒకటి, ఖమ్మం గ్రామీణం-6, కూసుమంచి-4, తిరుమలాయపాలెం-3, నేలకొండపల్లి-3, మధిర-3, బోనకల్లు-5, ఎర్రుపాలెం-9, ముదిగొండ-1, చింతకాని మండలంలో ఒకటి చొప్పున మొత్తం 36 పనులు మంజూరైనట్లు పీఆర్ ఖమ్మం డివిజన్ ఈఈ వెంకటరెడ్డి తెలిపారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రహదారులను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు.


ఖమ్మం గ్రామీణ మండలం తనగంపాడు - ఎంవీపాలెం వంతెన అప్రోచ్ రోడ్డు పునరుద్ధరణ పనులు

మరింత మెరుగుబడి!

ప్రాథమిక పాఠశాలలు.. ఖమ్మం: 813 భద్రాద్రి: 778

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రాథమిక విద్య బలోపేతం కానుంది. ఏళ్లుగా ఏకోపాధ్యాయ పాఠశాలల్లో సర్దుబాటు ప్రక్రియ, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ల (సీఆర్పీ)లతో చదువులు అరకొరగా సాగుతున్నాయి. తాజా డీఎస్సీ ద్వారా ఏకోపాధ్యాయ పాఠశాలలతో పాటు మూతపడిన బడులు పూర్వవైభవం సంతరించుకోనున్నాయి. ఇన్నాళ్లు ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు ఆశించిన స్థాయిలో వృద్ధి చెందటం లేదని వివిధ అధ్యయనాలు స్పష్టం చేసిన విషయం విదితమే. దీనికి తోడు ఇటీవల బదిలీలు, ఉద్యోగోన్నతులతో సమస్య మరింత జటిలంగా మారింది. ఈ ఏడాదే ఉద్యోగోన్నతుల అవకాశం కల్పించటంతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బోధనకు వెళ్లారు. మరికొందరు బదిలీ అయ్యారు. ఇలాంటి తరుణంలో డీఎస్సీ-2024తో సర్కారు ప్రాథమిక విద్యకు మహర్దశ కలిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం పోస్టింగ్ తీసుకొని బోధనను బుధవారం ఆరంభించారు. ఈనేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.



జిల్లాల వారీగా..

దసరా అనంతరం పండగ వాతావరణంలో పాఠశాలల్లో బోధన ప్రక్రియ పునఃప్రారంభమైంది. ఖమ్మం జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) 334 పోస్టులకు 317 మంది నియామక పత్రాలు అందుకొని పాఠాలు బోధిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏకోపాధ్యాయ పాఠశాలలు 185 ఉన్నాయి. కొత్త ఉపాధ్యాయుల రాకతో 2024 జూన్‌లో బదిలీ అయ్యి వేచిచూస్తున్న 229 మంది ఉపాధ్యాయులు రిలీవ్ అవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 268 పోస్టులకు 258 మంది ఎస్జీటీలు పాఠాలు బోధిస్తున్నారు. జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 234 ఉన్నాయి.

జిల్లాలో వివిధ కేడర్లకు చెందిన 520 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఖమ్మం డైట్ కళాశాలలో బుధవారం జరిగిన కౌన్సెలింగ్‌లో 516 మందికి పోస్టింగు ఉత్తర్వులిచ్చారు. ఒరిజనల్, ఇతర ధ్రువపత్రాలు సరిగా లేకపోవటం వల్ల నలుగురు అభ్యర్థులకు ఉత్తర్వులు ఇవ్వలేదు. జిల్లావ్యాప్తంగా 481 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఉత్తర్వులిచ్చిన 15రోజుల్లోపు విధుల్లో చేరే అవకాశముంటుంది.

రాష్ట్ర ప్రభుత్వ సత్వర నిర్ణయంతో ప్రాథమిక విద్య బలోపేతమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు అవకాశం లభించింది. మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతాయి.
- సోమశేఖరశర్మ, డీఈఓ

పెద్దలను చూసి పిల్లలు నేర్చుకుంటారనేది నానుడి. ఓ ఇద్దరు అక్కాచెల్లెళ్లు కూడా తండ్రిలాగే ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలని చిన్ననాటి నుంచి కలగన్నారు. కష్టపడి కొలువు సాధించారు. అదీ.. ఇద్దరూ ఒకేసారి కావడం విశేషం. బుధవారం ఉపాధ్యాయ వృత్తి ప్రారంభించిన సందర్భంగా వారిని 'న్యూస్‌టుడే' పలకరించింది. - కొత్తగూడెం విద్యా విభాగం, న్యూస్‌టుడే

ఒకేసారి ఎస్జీటీ ఉపాధ్యాయినులుగా ఎంపిక

తండ్రి బాటలో తనయలు


తల్లిదండ్రులతో అంజలి, దీప్తి

ఏన్కూరు మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన గణపురం శ్రీనివాసరావు, పుష్పవతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. అంజలి, దీప్తి. శ్రీనివాసరావు ఖమ్మం గ్రామీణ మండలం, గుడిమళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు. ఆయన ప్రభావం కుమార్తెలపై ఎంతో ఉండేది. దీంతో తాము ఉపాధ్యాయులుగా స్థిరపడాలని చిన్ననాటి నుంచే అనుకున్నారు. విద్యాభ్యాసం మొత్తం లక్ష్యం వైపే కొనసాగేలా జాగ్రత్తపడ్డారు. కోర్సులు పూర్తయిన డీఎస్సీకి ప్రణాళిక, పట్టుదలతో సన్నద్ధం అవుతున్న సమయంలోనే 2024 మార్చిలో నోటిఫికేషన్ వెలువడింది. ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో చేజార్చుకోవద్దని మరింత పట్టుదలతో, తండ్రి దిశా నిర్దేశంలో సన్నద్ధత కొనసాగించారు. సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) విభాగంలో ఇద్దరూ జిల్లా స్థాయి ర్యాంకులు సాధించి శెభాష్ అనిపించుకున్నారు.

☆ పెదమ్మాయి అంజలి డీఎస్సీలో జిల్లా స్థాయి 180వ ర్యాంక్ సాధించారు. పినపాక మండలం చొప్పగూడెం ప్రాథమిక పాఠశాలలో తొలిపోస్టింగ్‌లో చేరారు. బోధన వృత్తిని ఆరంభించారు. ఆమె.. ఎమ్మెస్సీ పీహెచ్, బీఎడ్ చదివారు. చిన్నమ్మాయి దీప్తి డీఎస్సీలో 79వ ర్యాంక్ సొంతం చేసుకున్నారు. అశ్వాపురం మండలం వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా బోధనను ప్రారంభించారు. ఆమె విద్యాభ్యాసమంతా ఇల్లెందు మండలంలో కొనసాగింది. బీఎస్సీ, డీఎడ్‌ను వరంగల్, ఖమ్మంలో పూర్తి చేశారు. ఉన్నత విద్య కోర్సులు పూర్తయిన వెంటనే సర్కారు కొలువులు సాధించడంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు.

'రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ వెలువరించడం సంతోషంగా ఉంది. ఈ అవకాశాన్ని మాలాంటి వారెందరో సద్వినియోగం చేసుకుని ఎంతో విలువైన బోధనా వృత్తిని చేపట్టారు. ఈ అవకాశం అదృష్టంగా భావిస్తున్నాం. ఇష్టంతో కష్టపడి చదివితే ప్రభుత్వ ఉద్యోగాలు సులభంగా సాధించవచ్చు.' - అంజలి, దీప్తి

బంతాటలో ఇంతుల జోరు

ఫుట్‌బాల్‌లో రాణిస్తున్న ఆ నలుగురు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీల ప్రత్యక్ష ప్రసారాలను చూసి ప్రభావితమయ్యే వారు మైదానాలకు వస్తున్నారు. కొద్ది రోజుల సాధన తర్వాత ఇది 'చూసినంత తేలిక కాదు, చాలా కష్టం, 'పేగులు కదిలిపోతున్నాయ్' అంటూ ఎక్కువ మంది ఆటకు దూరమవుతున్నారు. చెమటలు కక్కుతూ.. పడుతూ లేస్తూ.. గాయాలపాలవుతూ ఏళ్ల తరబడి సాధన.. బంతిని పూర్తిస్థాయిలో నియంత్రించే పట్టు సాధించాల్సి ఉంటుంది. ఇంతటి కఠినమైన ఆటను ఎంచుకున్నారు. జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారిణులు.. అంతటితో ఆగిపోలేదు.. వీరు ఫుట్‌బాల్ రంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే సీనియర్ నేషనల్స్ పోటీలకు అర్హత సాధించారు.



ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి మహిళా ఫుట్‌బాల్ పోటీలో ఖమ్మం జిల్లా జట్టుకు కాంస్య పతకం దక్కింది. ఖమ్మం జిల్లా జట్టులో ప్రతిభావంతంగా రాణించిన క్రీడాకారిణులు అఖిల, కావ్య, శ్రీలక్ష్మి, అలేఖ్య సీనియర్ నేషనల్స్ టోర్నీలో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్టులో స్థానం పొందారు. జాతీయ పోటీలు పశ్చిమ బంగా రాష్ట్రంలోని సిలిగురిలో జరుగనున్న జాతీయ టోర్నీలో తమ ప్రతిభాపాటవాలు చూపనున్నారు. సీనియర్ నేషనల్స్‌లో పాల్గొనడమే ఫుట్‌బాల్ క్రీడాకారులు ఎక్కువగా దృష్టి సారిస్తారు. ఇప్పుడు ఆడుతున్న నలుగురు క్రీడాకారిణులు ఇప్పటికే సబ్ జూనియర్, జూనియర్ నేషనల్స్ ఆడి ఉన్నారు. ఇదిలా ఉంటే వీరిలో కావ్య హైదరాబాదులో కానిస్టేబుల్‌గా విధుల్లో ఉంటూనే జిల్లా ఫుట్‌బాల్ రంగంలో తన ప్రస్థానం కొనసాగిస్తోంది. జాతీయ పోటీల్లో ఇప్పుడు పాల్గొనడం ఇది ఐదోసారి. అలేఖ్య ఓ అడుగు ముందుకేసి ఉమెన్స్ ఫుట్‌బాల్ లీగ్స్ పోటీలో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. శ్రీలక్ష్మి ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో చదువుకుంటూనే ఫుట్‌బాల్ రంగంపై దృష్టి సారించింది. రెండోసారి జాతీయ పోటీలకు అర్హత సాధించింది. అఖిల ఇటీవలే ఇంజినీరింగ్ పూర్తి చేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగం దక్కించుకుంది. తనూ స్కూల్ దశ నుంచి ఫుట్‌బాల్ సాధనలో ఉంది. జూనియర్, సీనియర్ జాతీయ పోటీల్లో పాల్గొన్న అనుభవం సొంతం చేసుకుని రెండోసారి సీనియర్ జాతీయ పోటీలకు బయలుదేరింది. కొన్నేళ్లుగా జిల్లా ఫుట్‌బాల్ సంఘం బాలికలు, మహిళా ఫుట్‌బాల్‌పై ఎక్కువ దృష్టి సారించిన ఫలితంగా వీరి సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. మహిళా ఫుట్‌బాల్ క్రీడాకారుల ప్రతిభాపాటవాలకు మెచ్చిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ రూ.1.5 లక్షలు స్వయంగా అందజేశారు. నిరంతరాయంగా పాఠశాల స్థాయి నుంచి కళాశాల వరకు క్రీడాకారులు చేజారకుండా చూడటంతో నేడు మహిళా ఫుట్‌బాల్ రంగం మంచి సంఖ్యలో క్రీడాకారులు, అంతే ఫలితాలు చూస్తున్నామని జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఆదర్శ్ చెప్పారు.


అఖిల, కావ్య, అలేఖ్య, శ్రీలక్ష్మి



రాములోరికి ఘనంగా తిరుమంజనం

☆ నేడు శబరిమాత ఉత్సవం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. వారానికి ఒకసారి ఉండే ఈ వేడుక ఆధ్యాత్మికతను పెంచింది. ప్రధాన ఆలయంలో కొలువైన కోదండ రాముడికి అర్చకులు సుప్రభాతం పలికి నామార్చన చేశారు. క్షేత్ర విశిష్టతను వైదిక పెద్దలు ప్రవచించారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. సీతాదేవికి యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీతధారణ భక్తిశ్రద్ధలతో సాగాయి. కల్యాణోత్సవంలో మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక భక్తులకు పరమానందాన్ని కలిగించాయి. దర్బారు సేవలో హరిదాసులు కీర్తనలు ఆలపించారు. గురువారం భద్రాచలం రామాలయంతో పాటు అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామంలో శబరిమాత వార్షిక ఉత్సవాన్ని గిరిజన సంప్రదాయంలో నిర్వహించేందుకు ఈఓ రమాదేవి ఏర్పాట్లు చేపట్టారు.

పచ్చదనం మధ్య పట్టాలు



పచ్చదనం మధ్య ఈ పట్టాలు గొందిగూడెం వద్ద కొత్తగూడెం-మణుగూరు రైల్వే మార్గానికి చెందినవి.. అశ్వాపురం మండలంలోని గొందిగూడెం, తుమ్మలచెరువు, వెంకటాపురం గ్రామ పంచాయతీల పరిధిలో ఈ మార్గం ఎక్కడాలేని విధంగా పచ్చని గుట్టలు, అడవులు, చెరువుల పక్క నుంచి అనేక వంపులు తిరుగుతూ ప్రకృతి సోయగాల మధ్య కొనసాగుతుంది. మణుగూరు నుంచి తొలుత ప్రయాణమే గుట్ట దిగువ భాగం నుంచి మొదలవుతుంది. గొందిగూడెం వద్ద పెద్ద వంపు తిరుగుతుంది. రెండు గుట్టల మధ్య ప్రవేశిస్తుంది. యూ ఆకారంలో వంపు తిరుగుతుంది. కాకతీయుల ప్రసిద్ధ సాగు నీటి వనరు తుమ్మలచెరువును ఆనుకుని ఎస్ ఆకారంలో అనేక వంపులు తిరుగుతూ ప్రయాణం కొనసాగుతుంది. పాండురంగాపురం వరకు ఓ వైపు గుట్ట, మరో వైపు అడవుల మధ్య నుంచి, పలు చెరువుల వంతెనలపై నుంచి కొనసాగే ఈ ప్రయాణం ప్రయాణికుల్లో ఎంతో ఆనందాన్ని ఆహ్లాదాన్ని కలిగిస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

– మణుగూరు గ్రామీణం, న్యూస్‌టుడే

కొనసాగుతున్న ఆర్థికసాయం

ఈనాడు కథనానికి స్పందన

సత్తుపల్లి, న్యూస్‌టుడే: వైద్య విద్యలో సీటు సాధించిన పేదింటి గిరి పుత్రిక రాజిని శివభార్గవికి మానవతావాదులు అండగా నిలుస్తున్నారు. సింగర్ శ్రీకాంత్ రూ.50 వేలు, పద్మావతి రూ.50 వేలు, కిరణ్ రూ.25 వేలు, భార్గవి రూ.10 వేలు, జనగా వెంకటేశ్ రూ.10 వేల చొప్పున రూ.1.45 లక్షలను బుధవారం ఆమెకు ఫోన్‌పే, ఆన్‌లైన్ ద్వారా బ్యాంక్ ఖాతాకు జమ చేశారు. ఇప్పటి వరకు విద్యార్థికి మొత్తం రూ.2.40 లక్షలు సమకూరాయి. అంతేగాకుండా పలువురు ఎన్ఆర్ఐలు కూడా తమవంతుగా సాయం చేస్తామని ఫోన్ చేసి భరోసా ఇచ్చారు.

చిరుత కోసం ట్రాపింగ్ కెమెరా ఏర్పాటు

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడు అటవీ రేంజిలోని ఎర్రగుట్ట ప్రాంతంలో సంచరిస్తున్న చిరుత జాడలను తెలుసుకునేందుకు అటవీశాఖ అధికారులు ట్రాపింగ్ కెమెరాను అమర్చారు. జూలూరుపాడు మండలం మున్యాతండాకు చెందిన రైతు తోటలో శునకాన్ని ఎత్తుకెళ్లిన ప్రదేశంలో కెమెరా ఏర్పాటు చేసి కదలికలను గమనిస్తున్నట్లు ఎఫ్ఆర్వో ప్రసాదరావు బుధవారం తెలిపారు. గుట్టకు ఆవల వైపు ఉన్న సూరారం ప్రాంతంలోని జామాయిల్ ప్లాంటేషన్ వైపు వెళ్లినట్లు పాదముద్రలు గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూనే ఎలాంటి అలజడి చేయకుండా ఉన్నట్లయితే దాన్ని గుర్తించే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై ఆ ప్రాంత రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నట్లు వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో కెమెరాకు చిరుత చిక్కినట్లు వస్తున్న చిత్రాలు నకిలీవని, తాము అమర్చిన వాటికి చిక్కితే అధికారికంగా విడుదల చేస్తామన్నారు.

తండ్రి చేతిలో కుమారుడి హతం


గణేశ్

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఘర్షణ పడిన కుమారుడిని తండ్రి ఆయుధంతో కొట్టి చంపిన ఘటన చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ కథనం మేరకు.. నగర శివారు రామన్నపేట కాలనీకి చెందిన కొంపెల్లి వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు గణేశ్(30) కారు డ్రైవర్‌గా పనిచేసేవారు. అతనికి ఐదేళ్ల క్రితం వివాహమై విడాకులు అవడంతో మద్యానికి బానిసై తల్లిదండ్రులు, సోదరుడితో తరచూ ఘర్షణ పడుతున్నారు. తల్లి, పెద్ద కోడలు ఊరికి వెళ్లడంతో మంగళవారం తండ్రి కొడుకులు ముగ్గురే ఇంట్లో ఉన్నారు. రాత్రివేళ మద్యం తాగిన వెంకటేశ్వర్లు, గణేశ్ ఘర్షణ పడుతుండటంతో పెద్ద కుమారుడు నాగేంద్రబాబు బయటకు వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో పక్కింటి వారు సమాచారం ఇవ్వడంతో తిరిగి వచ్చిన నాగేంద్రబాబుకు మంచంపై గణేశ్ రక్తపు మడుగులో పడి చనిపోయి కనిపించారు. అతని నుదుటిపై బలమైన గాయం ఉంది. వెంకటేశ్వర్లు కంగారుగా ఇంటి నుంచి పరుగెత్తారని స్థానికులు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. నాగేంద్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు. వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నారని, హత్యకు ఉపయోగించిన ఆయుధం లభించలేదని వెల్లడించారు.

హరిత హోటల్ రోజువారీ కార్మికుడి మృతిపై ఆందోళన


స్థానిక హరిత హోటల్ వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు, కుటుంబ సభ్యులు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: హోటల్ మేనేజరు పనిలో నుంచి తీసివేయడంతోనే మనో వేదనకు గురై ఇసంపల్లి నర్సింహారావు(40) మృతిచెందాడని ఆరోపిస్తూ అతని బంధువులు బుధవారం ఆ హోటల్ వద్ద మృతదేహంతో ఆందోళనకు దిగారు. వివరాలను పరిశీలిస్తే.. భద్రాచలం హరిత హోటల్‌లో పనిచేసే దినసరి వేతన కార్మికుడు నర్సింహారావును పనిలోకి రావొద్దని నెల రోజుల కిందట నిర్వాహకులు తొలగించారు. ఇంటివద్దనే ఉన్న కార్మికుడు గుండెనొప్పితో బుధవారం మృతి చెందాడు. దీంతో అతని బంధువులు ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పి ఆందోళన విరమించి హోటల్ ఉన్నతాధికారులతో మాట్లాడుకోవాలని సూచించారు. దీంతో వారు ఆందోళన విరమించారు. తన భర్తను మేనేజరు నాగలక్ష్మి విధుల నుంచి తొలగించడంతోనే మనోవేదనకు గురై గుండెనొప్పితో మృతిచెందాడని, ఆమెపై చర్యలు తీసుకోవాలని నర్సింహారావు భార్య లలిత స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సీతారామపురంలో ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృత్యువాత పడిన దుర్ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై గణేశ్ కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన వికాస్‌కుమార్(28) సీతారామపురంలో నూతనంగా నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవన పనులకు వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం విద్యుత్తు వైరింగ్ పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. తోటి కార్మికులు అతడిని వెంటనే భద్రాచలంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్..

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ తుటారి శివప్రసాద్ (58) గుండెపోటుతో బుధవారం మరణించారు. శివప్రసాద్ లక్ష్మీదేవిపల్లి శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలోనున్న ఈవీఎంల గోదాము వద్ద గార్డ్ డ్యూటీ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉన్నట్లుండి అస్వస్థతకు గురికావడంతో వెంటనే కొత్తగూడెంలోని జిల్లా సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మరణించినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరు బాలురిపై పోక్సో కేసు

బోనకల్లు, న్యూస్‌టుడే: ఇద్దరు బాలురిపై పోక్సో కేసు నమోదు మండలంలోని ఓ గ్రామంలో చోటు చేసుకుంది. ఏడేళ్ల బాలికపై తొమ్మిదేళ్ల వయసున్న ఇద్దరు బాలురు అత్యాచారయత్నం చేయగా బాలిక అరవడంతో పరారయ్యారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 13న ఈ ఘటన జరగ్గా పెద్దమనుషుల పరిష్కారం కోసం ప్రయత్నించారు. పరిష్కారంలో న్యాయం జరగలేదని బాలిక తల్లిదండ్రులు పోలీసుస్టేషన్‌కు రావడంతో ఎస్సై మధుబాబు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

'సీతారామ' కాలువలో మొసలి సంచారం



బూర్గంపాడు, న్యూస్‌టుడే: బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ సమీపంలోని సీతారామ ప్రాజెక్టు కాలువలో బుధవారం మొసలిని కనుగొన్నారు. పరిసర ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ అధికారులు, అటవీశాఖ అధికారులు సూచించారు. పశువులు, జీవాలు నీళ్ల దగ్గరకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కాలువ వద్దకు ఎవరూ వెళ్లరాదని పేర్కొన్నారు.

ఐదు కిలోల గంజాయి స్వాధీనం


గంజాయితో పట్టుబడిన యువకులు

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం ఎన్‌ఫోర్సుమెంట్ బృందాలు లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు వద్ద బుధవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో 5 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. ఒడిశా మల్కన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తూ మల్కన్‌గిరికి చెందిన ముద్దా కిశోర్, కరణ్ రాంబాబు, కరణ్ ఎర్రయ్యలు పట్టుబడ్డారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కొత్తగూడెం ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. తనిఖీల్లో సీఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ కరీం, బాలు, సిబ్బంది సుధీర్, వెంకట్, హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: కొత్తగూడెం పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదిన ఘటన ఒకరోజు ఆలస్యంగా వెలుగు చూసింది. దసరా సెలవుల్లో ఇచ్చిన హోంవర్కును పూర్తి చేయలేదనే కారణంతో ఉపాధ్యాయుడు గణేశ్‌టెంపుల్ ఏరియాకు చెందిన పదేళ్ల బాలుడిని మంగళవారం చితకబాదాడు. ఒంటిపై వాతలు తేలడంతో తల్లిదండ్రులు బుధవారం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఉపాధ్యాయుణ్ని పిలిపించి మాట్లాడారు. తల్లిదండ్రులకు పలువురు ఉపాధ్యాయులు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

బెదిరించిన ముగ్గురు వ్యక్తుల అరెస్టు

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని ఓ ఆసుపత్రి ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా కల్పిత వార్తను రూపొందించి ఏటా రూ.5లక్షలు యాడ్ రూపంలో చెల్లించాలంటూ బెదిరించిన ముగ్గురు యూట్యూబ్ ఛానల్ వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకున్నామని ఖమ్మం ఒకటో పట్టణ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆసుపత్రి యాజమాన్యం ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌కు చెందిన ఛానల్ సీఈఓ పుచ్చకాయల ప్రకాశ్, బ్యూరో చీఫ్ అత్తులూరి రామకృష్ణ(రాంకీ), ఖమ్మానికి చెందిన అసిస్టెంట్ కెమెరామెన్ షేక్ బాబాలపై దోపిడీ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

భార్య కాపురానికి రావడంలేదని భర్త ఆత్మహత్య


పొట్టా పవన్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: భార్య కాపురానికి రావడంలేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సత్తుపల్లి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చెరుకుపల్లి పంచాయతీ తురకలగూడెంకు చెందిన పొట్టా పవన్(27) కిష్టారానికి చెందిన ధనలక్ష్మిని ఏడేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈక్రమంలో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండగా రెండు నెలల క్రితం ధనలక్ష్మి పుట్టింటికి వచ్చి ఉంటోంది. దీంతో పవన్ మద్యానికి బానిసై మనస్తాపంతో బుధవారం తెల్లవారుజామున పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను సత్తుపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గిరిజన విద్యాలయాల్లో...

ముఖ గుర్తింపుతో హాజరు

భద్రాచలం, న్యూస్‌టుడే

గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని విద్యాలయాలలో ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) ద్వారా హాజరు సేకరణ చేస్తున్నారు. భద్రాచలం ఐటీడీఏ డీడీ ఆధ్వర్యంలో దీనిపై పర్యవేక్షణ పెంచారు. తరగతిలో ఉపాధ్యాయులు స్మార్ట్ ఫోన్‌లో ప్రత్యేకమైన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రతిరోజు ఉదయం ముఖ గుర్తింపు పద్ధతిలో హాజరు తీసుకుంటున్నారు. విద్యార్థులను ఎదురుగా ఉంచి వారి ముఖాన్ని ఫోన్‌లో ఫొటో తీయగానే వారు పాఠశాలకు వచ్చినట్లు హాజరు పడుతుంది. ఒకసారి హాజరు పడితే ఆ విద్యార్థి తరగతి గదిలో ఉన్నట్లే. కచ్చితమైన మెనూ పాటించేందుకు ఈ విధానం సహకరిస్తుంది. హాజరులో డబుల్ ఎంట్రీకి అవకాశం ఉండదు. గైర్హాజరైన వారి వివరాలు ప్రధానోపాధ్యాయుడికి చేరడం వల్ల ఏ తరగతిలో గైర్హాజరు ఎంత ఉందో స్పష్టత వస్తుంది. బడికి రాని వారిని వచ్చేలా చేసేందుకు వెంటనే వారి కుటుంబ సభ్యులకు ఈ సమాచారం చేరవేస్తున్నారు. అయితే వేర్వేరు కారణాలతో కొన్ని విద్యాలయాల్లో పాత విధానంలోనే హాజరు తీసుకుంటున్నారు. అక్కడా నూతన విధానం అమలుకు చర్యలు చేపట్టనున్నారు.

ఉపాధ్యాయులకూ వర్తింపు..

ఉపాధ్యాయుల హాజరును ఇదే విధానంలో ప్రధానోపాధ్యాయులు నమోదు చేస్తారు. వారు సమయానికి రాకపోతే హాజరు పడదు. ఎక్కడైతే విధులు నిర్వహిస్తున్నారో ఆ ప్రాంగణంలోనే ముఖ గుర్తింపు వర్తిస్తుంది. ఆ పరిధి దాటితే ఎఫ్ఆర్ఎస్ వర్తించదు. ప్రతిరోజు డీడీ కార్యాలయంలోని ప్రత్యేక విభాగానికి ఈ హాజరు వివరాలను పంపిస్తున్నారు. గైర్హాజరైతే ఎందుకు రాలేదన్నది వివరణ కోరుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో ఫోన్‌కు సిగ్నల్ అందని ప్రాంతాల్లో ముఖ గుర్తింపు హాజరుకు చిక్కులు తలెత్తుతున్నాయి.


ఫోన్ యాప్ సాయంతో విద్యార్థి హాజరు సేకరణ

విద్యాలయాలు	సంఖ్య	విద్యార్థులు	ఉపాధ్యాయులు/ సంక్షేమ అధికారులు
గిరిజన ప్రాథమిక పాఠశాలలు	219	4,868	414
గిరిజన ఆశ్రమ పాఠశాలలు	50	14,863	876
గిరిజన వసతి గృహాలు	13	1,263	13
పోస్టు మెట్రిక్ వసతి గృహాలు	22	3,000	22

విద్యా ప్రమాణాలు పెంచాలని..

విద్యార్థులు ప్రగతి సాధించాలన్నదే లక్ష్యంగా పీఓ రాహుల్ చర్యలు చేపట్టారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు గణితం, ఆంగ్లంలో పట్టు పెంచేందుకు నిపుణులతో ఈ రెండు అంశాలపై వర్క్ బుక్‌లు తయారు చేయించారు. త్వరలో వీటిని అందించనున్నారు. దాదాపు 2 వేల మంది పదో తరగతి చదువుతున్నందున ఎస్ఏ-1 పరీక్షల ఫలితాల ఆధారంగా గ్రేడ్లు గుర్తించి వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్ణయించారు. పబ్లిక్ పరీక్షలకు ముందు 100 రోజుల పాటు స్లిప్ టెస్టులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరు అత్యుత్తమ ప్రతిభ చాటాలన్నదే ధ్యేయంగా ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు.

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర •వైరా

ముళ్లపొదల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

ఏన్కూరు, న్యూస్‌టుడే: ఏన్కూరు శ్మశానవాటికలో దట్టంగా కమ్ముకున్న ముళ్లపొదలను అధికారులు బుధవారం తొలగింపు పనులు చేపట్టారు. వైకుంఠధామం కోసం ఆరు ఎకరాల స్థలం ఉన్నా అంతా ముళ్లపొదలతో ఉండటంతో 'చివరి మజిలీ ఎంత కష్టమో' అనే శీర్షికన ఈనెల 16న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో ఎస్.రమేశ్ జేసీబీతో శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి రాంకీని ఆదేశించారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది జేసీబీతో ముళ్లపొదలు తొలగిస్తున్నారు. ఏళ్ల తరబడిగా ఉన్న సమస్యకు పరిష్కారం ఏర్పడింది.

బొడ్రాయి ప్రతిష్ఠకు పొంగులేటి విరాళం

ముదిగొండ: మండలపరిధిలోని కట్టకూరులో బొడ్రాయి ప్రతిష్ఠా కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.20 వేలు నగదును గ్రామస్తులకు ఖమ్మం క్యాంపు కార్యాలయంలో బుధవారం అందజేశారు.

చర్చి నిర్మాణానికి.. బోనకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని రావినూతలలో నూతనంగా నిర్మిస్తున్న చర్చికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.20 వేలు విరాళంగా అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) సత్తుపల్లి : 93922 39905 మధిర : 98668 05652 వైరా : 76619 46938

సమస్య: గొల్లెనపాడులో చెత్త సేకరణకు వాహనం రావడం లేదు. ఇబ్బందిగా ఉంది. **- అక్కులు**

సమాధానం: వాహనం మరమ్మతులు చేయించడంతో ఆలస్యమైంది. చెత్త సేకరణ సమస్య లేకుండా చూస్తాం. **- జ్యోత్స్న, ఎంపీవో**

హనుమాన్‌బజార్‌లో డ్రైనేజీలు సరిగా శుభ్రం చేయడం లేదు. అసౌకర్యంగా ఉంది. **- శ్రీను**

✔ డ్రైనేజీల పూడిక వెంటనే తీయిస్తాం. **- వేణు, కమిషనర్** **- వైరా, న్యూస్‌టుడే**

కొణిజర్ల ప్రభుత్వ ఆసుపత్రి పక్కన పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా ఉంది. వాటిని తొలగించాలి. **- వెంకటేశ్వర్లు, కొణిజర్ల**

✔ కార్మికులతో మొక్కలను తొలగించే పనులు చేపట్టి ఆవరణను పరిశుభ్రంగా మారుస్తాం. **- సునీల్‌కుమార్, కార్యదర్శి** **– కొణిజర్ల, న్యూస్‌టుడే**

కారేపల్లిలో కుక్కల గుంపులతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గొర్రెల కాపరులు, గొర్రెలపై దాడికి పాల్పడుతున్నాయి. **- ఓ గొర్రెల కాపరి**

✔ సమస్యపై గ్రామాల వారిగా సమాచారం తీసుకుని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందిస్తాం. **- రమేశ్, ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్** **– కారేపల్లి, న్యూస్‌టుడే**

ఘనంగా దుర్గాదేవి శోభాయాత్ర



నాగులవంచలో దుర్గాదేవి ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

చింతకాని, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాగులవంచ షడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి శోభాయాత్ర బుధవారం నిర్వహించారు. మహిళల, చిన్నారుల కోలాటం, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం కోసం విజయవాడ తరలించారు.

కొనసాగిన కోటమైసమ్మ జాతర



ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

కారేపల్లి, న్యూస్‌టుడే: ఉసిరికాయపల్లిలో శ్రీకోట మైసమ్మ జాతర బుధవారం అంగరంగ వైభవంగా కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వాహన పూజలు, భక్తుల తాకిడితో ప్రాంగణాలు సందడిగా మారాయి. ఛైర్మన్ పర్సా పట్టాభి రామారావు, ఈవో వేణుగోపాలచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నత్తనడక పనులు.. ప్రయాణానికి అవస్థలు

వేంసూరు, న్యూస్‌టుడే

వేంసూరు, సత్తుపల్లి మధ్య రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి ఏడాదిన్నర గడిచినా ఇంకా నత్తనడకనే సాగుతున్నాయి. రూ.27 కోట్ల నిధులతో 13 కి.మీటర్ల పొడవునా నిర్మాణం చేపట్టాలని లక్ష్యం. సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ రోడ్డు ప్రస్తుతం పూర్తిగా శిథిలమైంది. వేంసూరు మండలం మర్లపాడుకూడలి నుంచి భీమవరం మీదుగా సత్తుపల్లి వరకు 13 కి.మీటర్ల పొడవునా తారురోడ్డు విస్తరణ పనులకు గత ప్రభుత్వం రూ.27 కోట్లు మంజూరు చేసింది. అయితే పనులు నాటి నుంచి నేటివరకు ముందుకు సాగడం లేదు. గతనెలలో 12 కి.మీటర్ల వరకు విస్తరణ పనులు పూర్తి చేసినా అత్యవసరమైన



మర్లపాడులో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు

మరో ఒక కిలోమీటరు దూరం ఇంకా అసంపూర్తిగానే ఉంది. ఈ రోడ్డు పనులు ప్రారంభం నుంచి మందకొడిగానే సాగినా గ్రామంలోకి కొచ్చేసరికి గుత్తేదారు పనులు పూర్తిగా నిలిపివేశారు. మర్లపాడు నుంచి భీమవరం, సదాశివపాలెం, సిద్ధారం, గౌరిగూడెం, కొత్తూరు, సత్తుపల్లి నుంచి నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నాయి. మర్లపాడు నుంచి కందుకూరు అడ్డరోడ్డు వరకు మిగిలి ఉన్న పాత రోడ్డు వర్షాలకు భారీ గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. మర్లపాడు-సత్తుపల్లి రహదారి విస్తరణ పనులు అసంపూర్తి నిర్మాణంపై ఆర్‌అండ్‌బీ ఇన్‌ఛార్జి ఏఈ రవిచంద్ర మాట్లాడుతూ ఆగిపోయిన కి.మీటరు వేరే బిట్టు అని అదికూడా వెంటనే ప్రారంభిస్తారని తెలిపారు.

రహదారి వెడల్పుతో 'దారి' తిప్పలు



బస్వాపురం సమీపంలోని మార్క్‌ఫెడ్ గోదాములకు వెళ్లే దారి మూసుకుపోయింది. కొణిజర్ల, చింతకాని రహదారిని రెండు వరసలుగా మార్చడంతో రహదారి ఎత్తు పెరిగింది. ఫలితంగా గోదాములకు వెళ్లే రోడ్డు కిందకు ఉండటంతోపాటు వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. స్థానికంగా కల్వర్టు నిర్మించి రహదారి ఎత్తుకు తగ్గట్టుగా గోదాము రహదారిని నిర్మించడమే సమస్యకు పరిష్కారం. అపుడే పంట ఉత్పత్తులు గోదాములలోకి ఎగుమతి, దిగుమతికి ఆస్కారం ఉండనుంది. **– కొణిజర్ల, న్యూస్‌టుడే**

గుంతల కూడలి



వైరా క్రాస్‌రోడ్డు గుంతలమయంగా మారింది. ఖమ్మం నుంచి తల్లాడ వైపు వెళ్లే మార్గం ఒకవైపు ఉండగా మరోవైపు కొత్తగూడెం, జగ్గయ్యపేట వెళ్లే వాహనాలు ఇక్కడ నుంచే దిశ మారుతుంటాయి. కానీ ఇక్కడ క్రాస్‌రోడ్డు గుంతలతో నిండి ఉంది. మలుపులో ఉండటంతో వేగంగా వచ్చే వాహనాలు, ద్విచక్రవాహనాలు కుదుపునకు గురై ప్రమాదాలకు గురవుతున్నాయి. చిన్నవానకు సైతం నీరు నిండి గుంతలున్నట్లు తెలియక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ నుంచి మధిర వెళ్లే మార్గంలో రెండు కిలోమీటర్ల వరకు గుంతలు ఎక్కువగా ఉన్నాయి. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ విశ్వనాథంను 'న్యూస్‌టుడే' ప్రశ్నించగా. గుంతల వద్ద మరమ్మతులు చేసే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. **– వైరా, న్యూస్‌టుడే**

పచ్చందాలు.. పైరుగాలులు



మాదారం పెద్దచెరువు కింద ఉన్న వందల ఎకరాల్లో ఈ ఏడాది వరి పంట సాగు చేశారు. కనుచూపు మేర పచ్చని పొలాల నుంచి వీచే పైరుగాలులు స్థానిక ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. **– కారేపల్లి, న్యూస్‌టుడే**



పైపులైన్ లీకులకు మరమ్మతులు

మధిర, న్యూస్‌టుడే: మధిర పురపాలక సంఘంలో రైల్వేస్టేషన్ ఎదుట మసీదు వద్ద కొన్ని నెలలుగా తాగునీటి పైపులైన్ లీకై నీరు వృథాగా పోతోంది. ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనిపై గత నెలలో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఏఈ నరేష్‌రెడ్డి లీకవుతున్న పైపులైన్‌కు సిబ్బందితో బుధవారం మరమ్మతులు చేయించారు.

షాదీఖానా పనులు ప్రారంభం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక వేంసూరు రోడ్డులో షాదీఖానా నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. గతంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో గత ప్రభుత్వ హయాంలో నూతన భవనం మంజూరు కాగా అసెంబ్లీ ఎన్నికల అనంతరం పనులు నిలిచాయి. తాజాగా ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రత్యేక చొరవతో పనులు పునఃప్రారంభం కావడంతో కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, గోలి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు.

గోడప్రతుల ఆవిష్కరణ

కారేపల్లి, న్యూస్‌టుడే: ఈనెల 20న హైదరాబాద్‌లో జరిగే టీయూసీఐలోకి ఐఎఫ్‌టీయూ విలీన సభను విజయవంతం చేయాలని కోరుతూ సంబంధించి గోడప్రతులను టేకులగూడెంలో బుధవారం ఆవిష్కరించారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, సక్రు, జోగ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హిందూ ఆలయాలపై దాడులకు నిరసనగా ర్యాలీ

వేంసూరు, న్యూస్‌టుడే: హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా వేంసూరు మండలం భీమవరంలో భీమవరం ఆధ్యాత్మిక మండలి ఆధ్వర్యంలో గ్రామ వీధుల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజన సమ్మేళనం జయప్రదం చేయండి

ఏన్కూరు, న్యూస్‌టుడే: ఖమ్మంలో నవంబర్ 5న నిర్వహిస్తున్న గిరిజన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూక్యా వీరభద్రంనాయక్, బాణోత్ బాలాజీ కోరారు. ఏన్కూరులో సంఘం నాయకులతో కలిసి గోడప్రతులు, కరపత్రాలు విడుదల చేశారు. నాయకులు భూక్యా లచ్చానాయక్, బాణోత్ అమల, బాణోత్ కృష్ణ, భూక్యా శ్రీనివాస్, గుగులోతు భావ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఏఆర్ మిల్లు ఆస్తుల వేలానికి ప్రభుత్వ యంత్రాంగం చర్యలు

కొణిజర్ల, న్యూస్‌టుడే: కొణిజర్ల మండలం లాలాపురం సమీపంలో ఉన్న ఎస్‌ఏఆర్ మిల్లు ఆస్తుల వేలానికి ప్రభుత్వం యంత్రాంగం చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మిల్లుకు సంబంధించిన నిర్వాహకులు 2022-23 రబీ, 2023-24 వానాకాలం సీఎంఆర్ బకాయిలకు సంబంధించి రూ.81.60 కోట్లు బాకీ పడగా ఈ సొమ్మును తీర్చాల్సిందిగా గతంలో జారీ చేసిన మొదటి నోటీసు గడువు ముగిసిన నిర్వాహకుల నుంచి ఎటువంటి స్పందన లేదు. ప్రస్తుతం రెండో నోటీసు జారీ చేయగా ఈ నోటీసు గడువులోగా సంబంధిత బాకీదారు సొమ్ము చెల్లించని పక్షంలో రెవెన్యూ చట్టం ప్రకారం డీఫాల్టర్ ఆస్తులను వేలం వేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టనున్నారు.

ఇసుక అక్రమ రవాణా కట్టడికి...

బోనకల్లు, న్యూస్‌టుడే: వైరా నది నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఎంత నిఘా పెట్టినా అక్రమార్కులు రాత్రిపూట ఇసుక తరలిస్తుండటంతో రీచ్‌ల వద్దకు ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళ్లకుండా రహదారికి అడ్డంగా జేసీబీతో పోలీసులు కందకాలు తీయించారు. బ్రాహ్మణపల్లి, రాపల్లి, కలకోట, మోటమర్రి రీచ్‌లకు వాహనాలు వెళ్లకుండా ఈ చర్యలు చేపట్టారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మధుబాబు హెచ్చరించారు.

140 క్యూబిక్ మీటర్ల ఇసుక రూ.1.73 లక్షలు

మధిర, న్యూస్‌టుడే: మధిర ప్రాంతంలో ఇటీవల కాలంలో అక్రమంగా రవాణా చేస్తూ పోలీసులు, రెవెన్యూ అధికారులకు పట్టుబడిన వాహనాల్లోని ఇసుకను స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో డంప్ చేశారు. ఆ ఇసుకను బుధవారం వేలం ద్వారా విక్రయించారు. 140 క్యూబిక్ మీటర్ల ఇసుకకు ప్రకటించిన ధర 89,880 కాగా వేలంలో రూ. 1.73 పలికిందని తహసీల్దార్ రాంబాబు తెలిపారు. మధిరకు చెందిన గంగాధర్ అనే వ్యక్తి దీనిని వేలంలో దక్కించుకున్నారు.

ఉద్యోగోన్నతిపై వెళ్తున్న ఇంజనీర్‌కు సన్మానం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక జేవీఆర్ సీహెచ్‌పీ ఇంజనీర్‌గా పని చేస్తున్న సురేశ్ డీజీఎంఎస్‌గా ఉద్యోగోన్నతిపై వెళ్తుండగా ఐఎన్‌టీయూసీ నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీహెచ్‌పీ ప్రాంగణంలో పిట్ సెక్రటరీ నాగేశ్వరరావు, బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతికుమార్‌లు పూలదండలు, శాలువాలతో ఆయన్ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం బాధ్యులు నాగేందర్, బొంతు శ్రీనివాస్, నగేశ్, కల్యాణ్, ప్రవీణ్, తిరుమలరావు, చంద్రశేఖర్, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు



సత్తుపల్లి: ఎంఈఓకు చేరిక పత్రాలను అందజేస్తున్న నూతన ఉపాధ్యాయురాలు

సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, న్యూస్‌టుడే: డీఎస్సీ 2024 ద్వారా ఎంపికైన నూతన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. సత్తుపల్లిలోని మండల వనరుల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి ఎన్.రాజేశ్వరరావుకు ఉపాధ్యాయులు చేరిక పత్రాలను అందజేశారు. 13 మంది ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ ఒకరు విధుల్లో చేరినట్లు ఎంఈఓ తెలిపారు. ☆ కల్లూరు మండల పరిధిలో నూతన ఉపాధ్యాయులకు ఎంఈఓ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంఈఓ నివేదిత బుధవారం నియామక పత్రాలను పరిశీలించి 42 మందికి బాధ్యతల స్వీకరణకు అనుమతులిచ్చారు. ☆ తల్లాడ మండలానికి 27 మంది ఉపాధ్యాయులు నియమితులయ్యారు. వీరిలో 21 మంది ఎస్జీటీలు, నలుగురు స్కూల్ అసిస్టెంట్, ముగ్గురు పీఈటీలు ఉన్నారు. వీరిలో 26 మంది విధుల్లో చేరారు.

ఏన్కూరు, కారేపల్లి, న్యూస్‌టుడే: ఏన్కూరు మండలంలో ఖాళీగా ఉన్న 20 ఎస్జీటీ పోస్టుల్లో కొత్తగా నియామకమైన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. తొలుత మండల వనరుల కేంద్రంలో ఎంఈవో శ్రీనివాస్‌కు రిపోర్టు చేసి వారికి కేటాయించిన గ్రామాల పాఠశాలలకు వెళ్లారు. ☆ కారేపల్లి మండలానికి 25 మంది నియమించడంతో స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో జయరాజుకు పత్రాలు అందించారు.

బోనకల్లు, ముదిగొండ, ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: బోనకల్లు మండలానికి 11 మంది ఉపాధ్యాయులు నియమితులయ్యారు. వీరికి ఎంఈఓ దారెల్లి పులయ్య ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎర్రుపాలెం మండలానికి 63 మంది ఉపాధ్యాయులు నియమితులయ్యారు. ముదిగొండ మండలానికి నలుగురు ఎస్జీటీలు, ఏడుగురు స్కూల్ అసిస్టెంట్లు వచ్చారని ఎంఈఓ రమణయ్య తెలిపారు.



కొత్తగా చేరిన ఉపాధ్యాయులతో ఏన్కూరు ఎంఈవో శ్రీనివాస్, పీఆర్‌టీయూ నాయకులు



విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయులతో ఎర్రుపాలెం ఎంఈఓ మురళీమోహన్



రాజ్యలక్ష్మిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మికి సన్మానం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి ఇటీవల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు తీసుకోవడంతో బుధవారం ఎమ్మెల్యే మట్టా రాగమయి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు.

☆ స్థానిక క్యాంపు కార్యాలయంలో తల్లాడ మండలం ఇందిరా క్రాంతి పథకం ఏపీఎం, సీసీలతో ఎమ్మెల్యే మట్టా రాగమయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు.

వైద్యవిద్య సీటు సాధించిన స్నేహ



సత్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు పట్టణ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన ఖమ్మంపాటి స్నేహ వైద్యవిద్య ములుగు ప్రభుత్వ వైద్యకళాశాలలో సీటు సాధించగా ఆమెను కల్లూరు మండల భవన నిర్మాణ కార్మికులు బుధవారం సత్కరించారు. మండల భవన నిర్మాణ కార్మికుల అధ్యక్షులు ఉప్పు నరసింహారావు, ఆశీర్వాదం, మహబూబ్ అలీ, వి.రవి, పిచ్చిరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి చేయూత

వైరా, న్యూస్‌టుడే: మెడిసిన్ చదువుతున్న వైరాకు చెందిన బొంతు భగత్‌కు దాతలు చేయూత అందించారు. విద్యావసరాల నిమిత్తం బోడపట్ల రవీందర్, కొంగర సుధాకర్, రోషన్ బేగ్ విద్యార్థికి ట్యాబ్‌ను బుధవారం అందించారు. మెడిసిన్‌లో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

సంభాని పరామర్శ

కల్లూరు, న్యూస్‌టుడే: ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీపీ వలసాల విజయలక్ష్మి భర్త విశ్రాంత ఉద్యోగి వలసాల లక్ష్మీనరసింహారావు కుటుంబ సభ్యులను బుధవారం మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంభాని చంద్రశేఖర్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పెద్దబోయిన దుర్గాప్రసాద్, బైరెడ్డి మనోహర్‌రెడ్డి, చెలికాని రాజబాబు, మాజీ ఎంపీపీ జొన్నలగడ్డ గోపాలస్వామి, లక్ష్మణరావు, అప్రోజ్ తదితరులు పాల్గొన్నారు.



వలసాల విజయలక్ష్మి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సంభాని చంద్రశేఖర్

ఆదర్శ కమ్యూనిస్టు నాగభూషణం: పోటు

బోనకల్లు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై చివరివరకూ పోరాడిన ఆదర్శ కమ్యూనిస్టు జక్కా నాగభూషణం అని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. ఆపార్టీ సీనియర్ నాయకుడు నాగభూషణం వర్ధంతి సభను బుధవారం ముష్టికుంట్లలో నిర్వహించారు. ఎన్ని ఆటుపోట్లు, ఆర్థిక ఇబ్బందులు వచ్చినా తట్టుకొని కమ్యూనిస్టుగా పేద ప్రజల కోసం పోరాడిన నాయకుడు నాగభూషణం అని వివరించారు. పేదవారి కోసం పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. నాగభూషణం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, రావి శివరామకృష్ణ, ఎంగల ఆనందరావు, తూము రోషన్ కుమార్, పవన్, సీపీఎం నాయకులు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న పోటు ప్రసాద్

వరి సాగు ఖర్చుల తగ్గింపుపై అవగాహన

కల్లూరు, న్యూస్‌టుడే: వరి సాగులో యాంత్రీకరణ, డ్రోన్స్‌ను ఉపయోగించుకొని ఖర్చులను తగ్గించి, ఆదాయాలను పెంచుకోవాలని భారతీయ వరి పరిశోధన సంస్థ కీటక విభాగం టెక్నికల్ అధికారి టి.వెంకయ్య, ఎస్‌బీఐ సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ అన్నారు. కల్లూరు మండలం రావికంపాడులో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఓ రూప, రైతులు, అధికారులు పాల్గొన్నారు.



వరిసాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఈ ఆహ్లాదం వెనక ఆందోళన

వేంసూరు మండలం మర్లపాడులో ఎర్రకుంట జలకళ సంతరించుకుంది. ఎర్రకుంట కట్టపై వరుస కటినట్టు ఏపుగా పెరిగిన పచ్చని కోనోకార్పస్ చెట్లతో ఆహ్లాదంగా, అందంగానూ కనిపిస్తుంది. కోనోకార్పస్ చెట్లు పర్యావరణానికి హాని కలిగిస్తాయని వృక్షశాస్త్రవేత్తలు నిర్ధారించిన నేపథ్యంలో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నానాటికీ ఏపుగా ఎదుగుతున్న వీటిని తొలగించాలని కోరుతున్నారు. ఎంపీవో రంజిత్‌కుమార్ మాట్లాడుతూ హరితహారం సమయంలో ఇవి విషపూరితమని తెలియక నాటామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చెట్లను తొలగిస్తామన్నారు. **– వేంసూరు, న్యూస్‌టుడే**



కోనోకార్పస్ చెట్లతో ఆహ్లాదంగా కనిపిస్తున్న మర్లపాడు ఎర్రకుంట

ఏసీపీ విచారణ

ఏన్కూరు, న్యూస్‌టుడే: కానిస్టేబుల్ భూక్యా సాగర్ ఆత్మహత్య ఘటనపై సత్తుపల్లి ఏసీపీ రఘు బుధవారం విచారణ చేశారు. బూర్గంపాడులో పని చేస్తున్న సాగర్ ఆత్మహత్యకు అక్కడ పని చేసిన ఓ సీఐ, ఇద్దరు ఎస్సైలు, ఓ నాయకుడు వేధింపులో కారణమని అతడి తండ్రి కిషన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే విషయాన్ని మృతి చెందిన కానిస్టేబుల్ తన మరణ వాగ్మూలంలోనూ ప్రస్తావించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆ ఘటనపై విచారణ ప్రారంభించారు. సాగర్ ఆత్మహత్యకు పాల్పడిన ప్రదేశాన్ని పరిశీలించి అతడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ ముత్తిలింగం, ఎస్సై మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

కారు ఢీకొని 8 మందికి గాయాలు

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు మండలం పేరువంచ గ్రామంలోని చైతన్య నగర్ వద్ద అతివేగంగా కారు ఢీకొనడంతో ఎనిమిది మంది గాయాలయ్యాయి. ఎస్ఐ షాకీర్ తెలిపిన వివరాల ప్రకారం... మార్త వేలాద్రి అనే కారు డ్రైవర్ బుధవారం తిరువూరు నుంచి కల్లూరు వైపు సాయంత్రం ఆరుగంటల సమయంలో ఎన్‌టీఆర్ నగర్ గ్రామంలోని ప్రధాన రహదారిపై నడుస్తున్న ఎనిమిది మందిని కారుతో ఢీకొట్టాడు. మంచాల చిన్ననరసయ్య, మంచాల నరసమ్మ తలకు తీవ్రగాయాలు కావడంతో ఖమ్మం తరలించారు. కల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో గాయపడిన కోట పెద్ద వెంకటేశు, చిన్న వెంకటేశు, విశ్వనాథం, నాగమ్మ, కమలమ్మ, వాసం వరయ్య చికిత్స పొందుతున్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి...

ఏన్కూరు, న్యూస్‌టుడే: జన్నారం క్రాస్‌రోడ్‌లో ఈనెల 14వ తేదీ సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేసుపల్లికి చెందిన పి.నరసింహారావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. జన్నారం రహదారిలో ఎదురుగా వస్తున్న కారు నరసింహారావు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో తలకు, శరీర భాగాలకు గాయాలయ్యాయి. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని హుటాహుటిన ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తండ్రి కోటయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో యువకుడికి..

కొణిజర్ల, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... తనికెళ్లకు చెందిన చల్లా శివకుమార్ ద్విచక్ర వాహనంపై ఇంటి వద్ద నుంచి పనిపై వైరా వెళ్తున్నాడు. కొణిజర్ల, పల్లిపాడు మధ్యనున్న రహదారి గుంతను తప్పించే క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. ద్విచక్ర వాహనంపై నుంచి పడటంతో తలకు గాయమై తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే అతడిని హైదరాబాద్ తరలించారు.

కాలువలోకి దూసుకుపోయిన కారు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి నుంచి నాగుపల్లి వైపునకు వెళ్తున్న కారు బుగ్గపాడు శివాలయం సమీపంలోని మూలమలుపు వద్ద బుధవారం అదుపుతప్పింది. రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకుపోయింది. ఘటనలో కారు స్వల్పంగా దెబ్బతినగా కారులో ఉన్న ఇద్దరు మహిళలు, ఓ యువకుడు క్షేమంగా బయటపడ్డారు. జేసీబీ సాయంతో సదరు కారును బయటకు తీశారు.

వివాహిత అదృశ్యం

ఏన్కూరు, న్యూస్‌టుడే: వివాహిత అదృశ్యంపై ఏన్కూరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. బురద రాఘవాపురం గ్రామానికి చెందిన వివాహిత ఈనెల 14న ఇంటిని నుంచి బయటకు వెళ్లి అప్పటి నుంచి కనిపించడం లేదని, బంధువుల ఇళ్లలో వెతికినా కనిపించలేదని భర్త ప్రకాశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మహ్మద్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ముదిగొండ: సువర్ణాపురం క్రాస్‌రోడ్డు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నారు. గంధసిరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ మురళి తెలిపారు.

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

అపూర్వ సమ్మేళనం



ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలోని సెయింట్ జోసెఫ్స్ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు బుధవారం సమావేశమయ్యారు. పరస్పరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గత స్మృతులను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థి అడ్వకేట్ తాళ్లూరి అరవింద్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులను సన్మానించారు.

18న ఉద్యోగ మేళా

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: ఖమ్మం మోడల్ కెరీర్ కేంద్రంలో ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు శుక్రవారం ఉపాధి కల్పన అధికారి మాధవి బుధవారం తెలిపారు. నగరంలోని రిలయన్స్ ట్రెండ్స్, భారత్ హుండయ్ సంస్థలో ఇంటర్, డిగ్రీ, డిప్లమా చేసిన వారు అర్హులని, 18 నుంచి 30 ఏళ్లలోపు యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధ్రువపత్రాలతో ఉదయం పది గంటలకు చేరుకోవాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 91541 18165
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

సమస్య: ఖమ్మం నగరంలోని శ్రీనగర్‌కాలనీ 16వ వీధిలో కాల్వలు, సీసీ రహదారి లేకపోవటంతో ఇబ్బందిగా మారింది. - మధుసూదన్, స్థానికుడు

సమాధానం: పరిశీలించి రహదారి, కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం. - కృష్ణలాల్, ఈఈ

ఖమ్మం నగరంలోని సరితాక్లినిక్ ప్రాంతంలో వీధికుక్కలు ఎక్కువగా సంచరిస్తుండటంతో రాత్రిపూట ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - పాఠకుడు

వీధికుక్కల నియంత్రణకు ఇప్పటికే చర్యలు చేపట్టాం. - రమేశ్, జంతు సంరక్షణ కేంద్రం ఇన్‌ఛార్జి - ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మద్దులపల్లి సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో పార్ట్‌టైం ప్రాతిపదికన కామర్స్ అధ్యాపక పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ లోపు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయ....

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఛైర్‌పర్సన్ నిష్కళంక తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో బోధించేందుకు సబ్జెక్టుల సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, బీఈడీ కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 19వ తేదీ లోపు kpmhskmm@gmail.comకు పంపించాలన్నారు. వివరాలకు 9440525093ని సంప్రదించాలని పేర్కొన్నారు.

అవిశ్రాంతంగా సేవ..!

రఘునాథపాలెం, న్యూస్‌టుడే

ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థుల ప్రాథమిక విద్యకు బాటలు వేశారు. పనిచేసిన ప్రతిచోటా ప్రజల గుర్తింపు పొందారు. ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేసినా ఆయన విశ్రాంతిని కోరుకోలేదు. పేద విద్యార్థుల విద్యాప్రగతే ప్రధానమంటూ తనకు దూరమైన భార్య పేరిట ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉన్నత విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు ఆర్థిక సాయమందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు పరిశ పుల్లయ్య.




ఎన్ఐటీ విద్యార్థి అడారి వినయ్‌కు చెక్కు అందజేస్తున్న పుల్లయ్య తదితరులు

పరిశ పుల్లయ్య ప్రస్థానం

తల్లాడ మండలం మిట్టపల్లికి చెందిన పరిశ పుల్లయ్య 1980 నుంచి 2017 వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించారు. 2010లో కొణిజర్ల మండలం రాజ్యాతండాలో పనిచేస్తుండగా జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్నారు. 2017 ఫిబ్రవరిలో ముదిగొండ మండలం బాణాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొందారు. ఆయన కొన్నేళ్లుగా ఖమ్మం నగరంలోని వీడీవోస్ కాలనీలో నివాసముంటున్నారు. ఆయనకు భార్య సీతారత్నం, కుమార్తెలు కృష్ణకుమారి, ఝాన్సీ కుమారి ఉన్నారు. 2020లో అనారోగ్యంతో సీతారత్నం మరణించారు. ఆమె స్ఫూర్తిగా పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2022 మార్చిలో పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్టును పుల్లయ్య నెలకొల్పారు. తనకు ప్రభుత్వం నుంచి అందుతున్న పింఛనులో సుమారు 50శాతం ఈ ట్రస్టు నిర్వహణకు వెచ్చిస్తుండటం పుల్లయ్య దాతృత్వానికి నిదర్శనం.

ట్రస్టు సేవలు ఇలా..

గత రెండున్నరేళ్ల వ్యవధిలో ట్రస్టు ఆధ్వర్యంలో పుల్లయ్య సొంతంగా, కుమార్తెల సహకారంతో రూ.11లక్షలు, బంధువులు, స్నేహితులు అందించిన విరాళాలు రూ.2లక్షలు మొత్తంగా రూ.13లక్షలతో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతాలు, పౌష్టికాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ సామగ్రి అందజేశారు. ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాలకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఐఐటీ, నిట్, వైద్య, బీ-ఫార్మసీ, ఇంజినీరింగ్, బీఈడీ వంటి ఉన్నత విద్యనభ్యసించే పేద విద్యార్థులకు ఆర్థిక సాయమందించారు. వివిధ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలకు అవసరమైన సామగ్రిని సమకూర్చారు. ఖమ్మం మహిళా కళాశాలలో టైలరింగ్ శిక్షణ కేంద్రానికి నాలుగు కుట్టుమిషన్లు కొనిచ్చారు. గేటెడ్ నుంచి జిల్లా స్థాయిలో పదోతరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తున్నారు.



జీవించి ఉండగా నా భార్య సీతారత్నం పేద పిల్లల విద్యను ప్రోత్సహించేది. ఆమె స్ఫూర్తిగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాను. పేద విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నా. ట్రస్టు ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలకు ఎంతోమంది ప్రోత్సాహం అందిస్తున్నారు.

- పి.పుల్లయ్య, పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు

వరద బాధిత బాలలకు సాయం



బాలలకు ఉపకరణాలు అందజేస్తున్న ప్రసాద్

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: మున్నేరు వరద బాధిత ప్రాంతాల్లోని 25 మంది బాలలకు స్కోప్ ఆర్డీ తరఫున సాయం అందించారు. వరదల్లో సర్వం కోల్పోయిన కుటుంబాల్లోని చిన్నారులకు స్టిచ్చింగ్ టెర్రడెస్ హోమ్స్ నెదర్లాండ్స్ సహకారంతో సంస్థ డైరెక్టర్ ఎంఎల్ ప్రసాద్ బుధవారం విద్యా ఉపకరణాలు పంపిణీ చేశారు. సుజాత, భవాని, నక్షత్ర పాల్గొన్నారు.

జవాన్ల మార్పునకు కసరత్తులు..!

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఖమ్మం నగరపాలక సంస్థ పారిశుద్ధ్య జవాన్లలో కొంతమందికి డివిజన్లు మార్చాలని అధికారులు నిర్ణయించారు. ప్రతి రెండు డివిజన్లకు ఓ జవాన్‌ను కేటాయించాలని భావిస్తున్నారు. పనితీరు బాగో లేదని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో సుమారు తొమ్మిది మంది జవాన్లకు స్థానచలనం కలగనున్నట్లు తెలిసింది. వీరికి ఉత్తర్వులను గురువారం అందజేయనున్నట్లు సమాచారం.

'ఇందిరమ్మ' లబ్ధిదారుల్లో అనర్హులుంటే ఉపేక్షించబోం: పొంగులేటి

కూసుమంచి, న్యూస్‌టుడే: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా అర్హులనే ఎంపిక చేయాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. లబ్ధిదారుల్లో ఏ ఒక్కరు అర్హత లేని వారున్నా.. ఉపేక్షించబోమని, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖమ్మం గ్రామీణ మండలంలోని కాంగ్రెస్ నాయకులు, అధికారులతో కూసుమంచిలోని తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం సుదీర్ఘంగా సమీక్షించారు. ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తవుతున్న నేపథ్యంలో నెలాఖరు నాటికి గ్రామాల వారీగా మంజూరు చేయాల్సిన ఇళ్ల జాబితా వస్తుందన్నారు. మొదటి దశలో నిరుపేదలను పార్టీలకతీతంగా ఎంపిక చేయాలని సూచించారు. నాలుగైదు రోజుల్లో కుటుంబ డిజిటల్ కార్డు ద్వారా రేషన్, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ తదితర సంక్షేమ పథకాలు అమలులోకి వస్తాయన్నారు. జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం సరఫరా చేస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్డీఓ గణేష్ తదితరులు పాల్గొన్నారు. గతంలో గృహనిర్మాణశాఖలో ఒప్పంద ఉద్యోగులుగా పనిచేసి ప్రస్తుతం ఖాళీగా ఉన్న తమకు మాతృశాఖలో ఉద్యోగాలు కల్పించాలని మంత్రిని పలువురు కోరారు.



ఖమ్మం గ్రామీణం మండల అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కలెక్టరేట్ వద్ద బస్టాప్‌లు సిద్ధం



కలెక్టరేట్ ఎదుట ఓ వైపు రూ.4 లక్షలతో నిర్మించిన బస్టాప్



మరోవైపు బస్టాప్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్

కలెక్టరేట్ ఎదుట రోడ్డు పక్కన బస్సుల కోసం నిరీక్షించే ఉద్యోగులు, ప్రజల సౌకర్యార్థం రెండువైపులా రూ.13 లక్షలతో బస్టాప్‌లు నిర్మిస్తున్నారు. పనులు తుది దశకు చేరుకున్నాయి. రూ.9 లక్షలతో చేపట్టిన బస్టాప్ వద్ద ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ అందుబాటులోకి రానుంది. బస్టాప్‌లను త్వరలో ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. – ఈనాడు, ఖమ్మం

ఓటు నమోదు చేసుకోండి

కూసుమంచి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలకుగాను మండలంలోని ఉపాధ్యాయులు తమ ఓటును నమోదు చేసుకోవాలని టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సాయిరెడ్డి ఉపాధ్యాయులను కోరారు. కూసుమంచి, నాయకన్‌గూడెం పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి బుధవారం విజ్ఞప్తి చేశారు. వచ్చే నెల ఐదో తేదీ నాటికి గడువు ఉందని, ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

కూసుమంచి, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని ఇన్‌ఛార్జి తహసీల్దార్ సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. జక్కేపల్లి, చేగొమ్మ, మల్లేపల్లి, జుజ్జులరావుపేట, పాలేరు, కొత్తూరు, కూసుమంచి, నర్సింహులగూడెం, పాలేరు-2, రాజుపేట, నాయకన్‌గూడెంలో కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎం సత్యవర్ధన్‌రాజు, ఏవో వాణి, ఎంపీవో రామచంద్రారావు పాల్గొన్నారు.

నేడు ఎంపీ ఈటల రాజేందర్ రాక

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: మల్కాజ్‌గిరి ఎంపీ, భాజపా జాతీయ నాయకుడు ఈటల రాజేందర్ గురువారం ఖమ్మంలో పర్యటిస్తారని డా.శీలం పాపారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖానాపురం ఛత్రపతి శివాజీ సంకల్ప యూత్ ఆధ్వర్యంలో ఖానాపురం (7వ డివిజన్)లో ఏర్పాటు చేసిన శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి నిర్వహించనున్న ప్రదర్శనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి క్రికెట్ పోటీలు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో ఖమ్మం జోన్ క్రికెట్ పోటీలు గురువారం ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో ప్రారంభం కానున్నాయని సమన్వయకర్త డా.బి.వెంకన్న తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 12 కళాశాలలు పాల్గొననున్నాయని, రెండు రోజుల పాటు మ్యాచుల నిర్వహణ, అనంతరం ఖమ్మం జోన్ జట్టు ఎంపిక చేస్తామని వివరించారు.

దంత సమస్యలపై అవగాహన

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: దంత సమస్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నిపుణులు సూచించారు. మమత దంత వైద్య కళాశాలలో బుధవారం అంతర్జాతీయ ఎండోడోంటిక్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పంటి నొప్పులకు రూట్ కెనాల్స్ శస్త్రచికిత్స ద్వారా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రంగు మారిన దంతాలకు బ్లీచింగ్ వంటి విషయాలపై రోగులకు అవగాహన కల్పించారు. హెచ్ఓడీ డా.అనితారావు, ప్రొఫెసర్లు చంద్రశేఖర్‌రావు, శ్రీదేవి, మురళి, ప్రదీప్, పుష్పావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: ఎమ్మెల్సీ

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని ఎమ్మెల్సీ తాతమధుసూదన్ అన్నారు. భారాస మండలాధ్యక్షుడు భాషబోయిన వీరన్నను జల్లేపల్లిలో బుధవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనీ, ప్రజల అభివృద్ధి కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. లింగాల కమలరాజు, మంచానాయక్, కొండబాల వెంకటేశ్వర్లు, రాజు, చంద్రశేఖర్, వేణుగోపాలకృష్ణ, శ్రీను, జగదీశ్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన క్రీడాకారులకు ప్రశంసలు

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: ఆటలు ఆడటం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వంతో పాటు సోదరభావం పెంపొందుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి అన్నారు. కూసుమంచి, ముదిగొండ, తిరుమలాయపాలెం మండలాల్లోని విద్యార్థులకు 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్' ఆధ్వర్యంలో జోనల్ గేమ్స్ నిర్వహించారు. పోటీల్లో తిరుమలాయపాలెం మండల క్రీడాకారులు పలు ఆటల్లో గెలిచి ఓవరల్ ఛాంపియన్‌గా స్థానం సాధించడంతో బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో క్రీడాకారులను అభినందించారు. గ్రామ ప్రత్యేకాధికారి సీతారామిరెడ్డి, జాతీయ స్థాయి ఉత్తమ అవార్డు గ్రహీత ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దులపల్లి ఏఈగా బాధ్యతల స్వీకరణ

ఖమ్మం గ్రామీణం: మద్దులపల్లి విద్యుత్తు ఉపకేంద్రం ఏఈగా ప్రభాకర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఈ క్రాంతి సింహ ఖమ్మం ఒకటో పట్టణానికి బదిలీ అయ్యారు. ఖమ్మంలో ఏఈగా ఉన్న ప్రభాకర్‌రావు ఇక్కడికి బదిలీపై వచ్చారు.

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో మేయర్ నీరజ, కార్పొరేటర్లు తదితరులు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని మామిళ్లగూడెంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మేయర్ పునుకొల్లు నీరజ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరపాలక సాధారణ నిధుల నుంచి బీటీ రహదారుల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్పొరేటర్లు బుడిగెం శ్రీనివాస్, దుద్దుకూరు వెంకటేశ్వర్లు స్థానికులు పాల్గొన్నారు. అనంతరం 15వ డివిజన్ రుద్రమ్మకోటలో నిర్వహించిన 'స్వచ్ఛదనం. పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్పొరేటర్ రావూరి కరుణ పాల్గొన్నారు.

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: వి.వెంకటాయపాలెం ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో అల్లీపురంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేయర్ నీరజ, సంఘం ఛైర్మన్ రావూరి సైదుబాబు ప్రారంభించారు. సైదుబాబు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంఘం వైస్ ఛైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావు, మెప్మా పీడీ మహేందర్‌రెడ్డి, అధికారి అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు చేయండి

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఇంటి పన్నులు నూరుశాతం వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. ఖమ్మంలోని డీపీఆర్సీ భవనంలో ఖమ్మం పంచాయతీరాజ్ డివిజన్ పరిధిలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పన్ను బకాయిలు సైతం వసూలు చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డీఎల్పీఓ రాంబాబు, ఎంపీఓలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు

'పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి'

సుభాష్‌నగర్(కరీంనగర్), న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జిల్లాల్లో పద్మశాలీలు సత్తా చాటాలని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి పిలుపునిచ్చారు. కరీంనగర్ పద్మశాలి ట్రస్టు భవనంలో ఆ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సమావేశానికి జాతీయాధ్యక్షుడు కందగట్ల స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ గడువు పూర్తయిన జిల్లా శాఖలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. మార్చిలో పది వేల మందితో అఖిల భారత పద్మశాలి సంఘం మహాసభ నిర్వహిస్తామని వెల్లడించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కూసుమంచి, న్యూస్‌టుడే: సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై కారు బోల్తాపడిన ఘటనలో గాయపడిన మహ్మద్ హూర్‌జహాన్ (59) అనే మహిళ ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈనెల 13న ఉదయం హైదరాబాద్ నుంచి ఖమ్మానికి కారులో వస్తుండగా కూసుమంచి మండలం మునిగేపల్లి సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తాపడిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో సయ్యద్ మొయినొద్దీన్ అలీ అక్కడికక్కడే మృతిచెందగా అతడి సోదరి హూర్‌జహాన్ ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు కూసుమంచి ఠాణాకు సమాచారమందింది. కూసుమంచి పోలీసులు మృతదేహాన్ని సర్వజనాసుపత్రికి తరలించి శవపరీక్ష నిర్వహించారు.

యువకుడి అదృశ్యం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: యువకుడు కనిపించకుండా పోయిన ఘటనపై ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. దానవాయిగూడేనికి చెందిన షేక్ యాకూబ్‌పాషా(30) పెవిలియన్ మైదానం వద్ద వాటర్ సర్వీసింగ్ సెంటర్ నడుపుతున్నారు. మంగళవారం(15న) సర్వీసింగ్ సెంటర్‌కు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. అతడి తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ తెలిపారు.

విద్యారంగంపై నిర్లక్ష్య ధోరణి వీడాలి

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యా వ్యవస్థ గందరగోళ పరిస్థితుల్లో ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న బోధనా రుసుములు, ఉపకార వేతనాలను విడుదల చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు, ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యజమానులు డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం విద్యార్థి సంఘాలు, ప్రైవేటు విద్యాసంస్థల యజమానులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శులు నామాల ఆజాద్, తాళ్ల నాగరాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ఆర్జేసీ విద్యాసంస్థల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడారు. విద్యా రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం యాజమాన్యాలతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని, స్పందించకుంటే ఈనెల 18న పెద్ద ఎత్తున చలో కలెక్టరేట్ ముట్టడి, దశల వారీగా ఆందోళనలను జిల్లా వ్యాప్తంగా ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కోట అప్పిరెడ్డి, మోహన్‌రెడ్డి, కిరణ్‌శౌరి, నవీన్, బొమ్మా సత్యప్రసాద్, కిరణ్, నాయకులు ఆవుల అశోక్, టి.లక్ష్మణ్, వి.వెంకటేశ్ పాల్గొన్నారు.



ఐక్యతను ప్రదర్శిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు, ప్రైవేటు విద్యాసంస్థల యజమానులు

★ పెండింగ్‌లో ఉన్న బోధనా రుసుములు, ఉపకార వేతనాలను విడుదల చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అనుబంధ పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.క్రాంతి, జి.మస్తాన్ ఓ ప్రకటనలో కోరారు.

మిరప తోటల పరిశీలన

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: భూమిలో తేమ ఎక్కువగా ఉండటంతో మిరప పైరులో మొదలు కుళ్లుడు తెగులు కనిపిస్తోందని మండల వ్యవసాయ అధికారి మహేశ్‌రెడ్డి తెలిపారు. ఈర్లపూడిలో మిరప తోటలను బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం మిరప పైరు పూత, కాత దశలో ఉందని, భూమిలో తేమ అధికమవటంతో కాండం, మొదలు కుళ్లుడుతో మొక్కలు వడలిపోయి ఎండిపోతున్నాయని వివరించారు. దీని నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్(బ్లూ కాపర్) లీటరు నీటికి మూడు గ్రాముల చొప్పున కలిపి మొక్కల మొదలు, చుట్టుపక్కల తడిచేలా పిచికారి చేయాలని సూచించారు. నత్రజని ఎరువుల వాడకం, నీటి తడులు తగ్గించాలన్నారు.

'పరిహారం అందించడంలో ప్రభుత్వం విఫలం'

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: మున్నేరు వరదలతో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలని అఖిలపక్ష పార్టీల జిల్లా నేతలు డిమాండ్ చేశారు. అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఖమ్మం అర్బన్ తహసీల్దారు కార్యాలయం ఎదుట బాధితులు ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ. . జిల్లాలోని ముగ్గురు మంత్రులకు శంకుస్థాపనల మీద ఉన్న దృష్టి వరదల్లో నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం అందించడంలో లేదని విమర్శించారు. వరదలతో మున్నేరు పరీవాహక ప్రాంతాలు నీటమునిగి ఇల్లు దెబ్బతిని, ప్రజలు సర్వం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సాయంగా ప్రకటించిన రూ.16,500 ఇంతవరకు వందలాది మంది బాధితుల బ్యాంకు ఖాతాల్లో పడలేదని తెలిపారు. సీపీఐ జిల్లా నాయకుడు నూనె శశిధర్, భారాస జిల్లా నాయకుడు గుండాల కృష్ణ, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు, బాధితులు

ఖమ్మం గ్రామీణం: వరద బాధితులను ఆదుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ మాట్లాడారు. ఇందిరమ్మకాలనీ, కేబీఆర్‌నగర్‌కాలనీ, కస్నాతండా, వాల్యాతండా, తనగంపాడు గ్రామాల బాధితులకు సాయం అందలేదన్నారు. అనంతరం ఉపతహసీల్దార్ సంపత్‌కి వినతిపత్రం అందజేశారు. సుదర్శన్‌రెడ్డి, పి.మోహన్‌రావు, కృష్ణ, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు..

శ్రీనివాస: వెట్టయన్, శ్రీసాయిరాం: విశ్వం
వినోద: జనక అయితే గనక
సీఎన్ సినీ గెలాక్సీ: సత్యం సుందరం
శ్రీతిరుమల: దేవర పార్ట్-I, కేపీఎస్: మార్టిన్

ఘనంగా వన మహోత్సవం

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరం పుట్టకోటలోని శ్రీచైతన్య గ్లోబల్ విస్తా పాఠశాలలో వన మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్ మాధుర్, ప్రిన్సిపల్ జయసుధ, టీఎల్ఎన్ శర్మ, కో ఆర్డినేటర్ లక్ష్మి పాల్గొన్నారు.



వన మహోత్సవంలో పాల్గొన్న మేయర్ నీరజ, ప్రిన్సిపల్ తదితరులు

సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

ఖమ్మం గ్రామీణం, కూసుమంచి, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని రాష్ట్ర సభ్యత్వ సహా కన్వీనర్, జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం గ్రామీణ మండలాల్లోని సభ్యత్వ నమోదును బుధవారం పరిశీలించి, బూత్ అధ్యక్షులు, శక్తికేంద్ర ఇన్‌ఛార్జిలతో సమీక్ష నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, హనుమంతరావు, సుధాకర్, వెంకటేశ్వర్లు, ఉపేందర్, గోవిందరావు, సూరిబాబు, సాగర్, భాణ్యానాయక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కామేపల్లి, న్యూస్‌టుడే: కొమ్మినేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను డీడబ్ల్యూవో శ్రీరామ్ గోపాల్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణులకు అమలు చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. పలు వివరాలు సీడీపీవో దయామణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రాజెక్టు కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు.

పేరుకే ఉద్యానం.. ఆటపాటలకు ఆగమాగం..!

ఖమ్మం శివారులోని వెలుగుమట్ల అర్బన్ పార్కులో పిల్లల ఆట పరికరాలు అధ్వానంగా తయారయ్యాయి. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ పరికరాలు ఎండకు ఎండి, వానకు తడిసి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఈ అంశంపై ఎఫ్ఎస్ఓ రమేష్ 'ఈనాడు'తో మాట్లాడుతూ విలువైన పరికరాలు పాడయ్యాయని తెలిపారు. వీటి మరమ్మతులపై దృష్టి సారించాలని ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. – ఈనాడు, ఖమ్మం



దెబ్బతిన్న రోప్‌వే, ప్రమాదకరంగా వేలాడుతున్న చెక్కలు



పార్కులో మరమ్మతులకు గురైన ఆట పరికరం